Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# జాషువా వర్ణనల విశిష్టత

**యస్. విద్యాసాగర్,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు,
కర్నూలు (జిల్లా), సెల్: 94410 82599

శ్రీగుర్రం జాషువాగారి రచనల ద్వారా ఒక గొప్ప సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తిగా, మహాకవిగా మనకు కనిపిస్తాడు. కవి అక్షరాన్ని, గాయకుని కంఠాన్ని నిలువరించే శక్తి, అధికారం ఎవరికీ ఉండకూడదని ఆక్రోశించి, శాసించిన మాటలే గుర్రం జాషువా. కవిని శాశ్వతున్ని చేశాయి. అనంతునిగా కీర్తిస్తున్నాయి.

గుర్రం జాషువా తెలుగు సాహితీ పూతోటలో విర బూసిన సాహితీ సుగంధ పుష్పం. ఆయన పేరు వింటేనే తెలుగు పద్యాలు మల్లెలు పరిమళాల్ని వెదజల్లుతాయి. కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడ్డ మహా కవి. సంఘ సంస్కరణ ఆయన కావ్యలక్షణం. వర్గసంఘర్షణ, ఆర్థిక వ్యత్యాసాలు, దోపిడీ వర్గాలపై తిరుగుబాటు చేసిన ఈ అభ్యుదయవాది 1895 సెప్టెంబర్ 28న వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించారు. జాషువ వినుకొండలో ప్రైమరీ స్కూల్లో చేరారు. స్కూల్‌లో చేరినప్పటి నుండి అంటరానితనం జాషువాను పీడించింది. ఎన్నో అవ మానాలను, కష్టాలను ఎదుర్కొంటూనే ఉన్నత విద్యను వినుకొండలోనే విజయవంతంగా పూర్తి చేశారు. 1910లో మరియమ్మను వివాహం చేసుకున్నారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేశారు. ఆ తర్వాత రాజమండ్రి వెళ్లి 1915–1916లలో అక్కడ సినిమా ప్రచారకునిగా పనిచేశారు.

పుట్టుకతో దళితుడైన ఈయన పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవిచక్రవర్తి, తన కవితాప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి, విశ్వమానవుడు శ్రీ గుర్రం జాషువా గారు. ఆధునిక తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా సమకాలీన కవిత్వ వరవడియైన భావ కవిత్వపు రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు. ఈ భావకవిత్వం బలంగా ఉన్న రోజుల్లో కవిగా జాషువా రూపొందిన కాలం. అయినా 1933లోనే అయోమయం వంటి ఖండికలతో భావకవిత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మరో రకంగా చెప్పాలంటూ ఎదురొడ్డి నిలిచారు. దాని ఫలితమే 1935లో ముద్దుకృష్ణగారు సంకలించిన "వైతాళికులు"లో జాషువా లేకుండా పోయారని దానికి కులం కారణమని ఎండ్లూరి సుధాకర్ విశ్లేషించారు. ఇది వాస్తవమైనా జాషువా భావకవిత్వాన్ని కొన్ని అంశాల్లో స్వీకరించారు. గొప్ప స్మృతిగీతాలు కూడా రాశారు. గాంధీజీ ప్రవేశపెట్టిన సంఘ సంస్కరణోద్యమాన్ని దేశాభిమానాన్ని గానం చేశారు. అంతేకాదు భావకవిత్వం చేత ఆదరించబడిన ఖండకావ్య ప్రక్రియ జాషువా చేతుల్లోనే సిద్ధిపొందిందనడం జగత్ప్రసిద్ధం. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డాడు జాషువా. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. అగ్రవర్ణ దురహంకారాలను చవిచూసిన శ్రీ జాషువా సౌమ్య పదజాలంతోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్లు "నాకు గురువులు ఇద్దరు పేదరికం, కులమత బేధం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది" అన్నది ఆయన కవిగా, వ్యక్తిగా విరాట్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. అందుకోసం

"కులమతాలు గీచుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టు వడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన
నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను" అంటూ ఆయన తనకు తాను విశ్వనరునిగా ప్రతిపాదించుకున్నాడు.

జాషువా కలానికి చిక్కని వర్ణన తెలుగు సాహిత్యంలోనే లేదని చెప్పవచ్చు. అన్ని అంశాలపై ఆయన రాసిన పద్యకవిత్వం ఇందుకు ప్రబల తార్కాణం. మనిషి పుట్టినప్పటి నుండి చచ్చి స్మశానంలో బూడిదగా లేక మట్టిలో కలిసే వరకు మానవ జీవితంలోని అన్ని దశలను 'శిశువు' నుంచి 'స్మశానవాటి' వరకు తన కవితా ఖండికలలో గుదిగుచ్చాడు. మానవుని గురించే కాకుండా ఇంటిలో బూజు అని మనం అప్పుడప్పుడు దులిపే బూజుపురుగు సాలీడును సైతం జాషువా కవిత్వీకరించాడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ప్రస్తుతం ఈ వ్యాసంలో జాషువా కవిత్వంలోని వర్ణనలను రేఖామాత్రంగా పరిచయం చేస్తాను.

"అక్షయంబైన మాతృక్షీర మధుధార లన్నంబుగా తెచ్చుకొన్న యతిథీ" అన్నది ఎంత అందమైన భావన. మనం రోజూ చూసే సామాన్యమైన విషయాల్లోంచి అందమైన కవిత్వాన్ని సృష్టిస్తాడు కవి. జాషువా చేసింది అదే! "అమృతమ్ము విషమను వ్యత్యాస మెరుగ కాస్వాదింప చను వెర్రిబాగులాడు" అని కానీ" ఎవ్వరెరుంగ రితని దేదేశమో గాని, మొన్న మొన్న నిలకు మొలిచినాడు" అని కానీ అప్పుడే పుట్టిన పాపాయిని వర్ణించడం గొప్ప కవులు మాత్రమే చెయ్యగలరు. తల్లికి పిల్లలపై ఉన్న ప్రేమ గురించి గొప్ప కవులు ఆర్ద్రతతో ఎంతో సాహిత్యం సృష్టించారు కానీ, "అమ్మతో తనకెంత సంబంధమున్నదో, ఏడ్చి యూడిగము సేయించుకొనును" వంటి భావంతో తల్లి-బిడ్డల బంధాన్ని ఇంత చక్కగా వర్ణించటం జాషువా గారికే చెల్లింది.

నవమాసములు భోజనము నీరమెరుగక,
పయనించు పురిటింటి బాటసారి
చిక్కు చీకటి చిమ్ము జానెడు పొట్టలో,
నిద్రించి లేచిన నిర్గుణుండు
నును చెక్కిళుల బోసినోటి నవ్వులలోన,
ముద్దులు చిత్రించు మోహనుండు
అక్షయంబైన మాతృక్షీర మధుధార
లన్నంబుగా తెచ్చుకొన్న యతిథీ
బట్ట కట్టడు, బిడియాన బట్టువడదు,
ధారుణీ పాఠశాలలో చేరినాడు, (కానీ)
వారమాయెనో లేదో మా ప్రకృతి కాంత
కరపి యున్నది వీని కాకలియు నిద్ర!

మా చిట్టి పాప నా ఒళ్ళో ముత్యాలు పోశాదు. నెలబాలుడై ఆనందాన్ని కుప్పపోశాదు. చిట్టిబాబూ!

బొటవ్రేల ముల్లోకములు జూచి లోలోన
నానందపడు నోరులేని యోగి
తల్లి తండ్రుల తనూ వల్లరీ ద్వయికి వ
న్నియ పెట్టు తొమ్మిది నెలల పంట
అమృతంబు విషమను వ్యత్యాస మెరుగ
కాస్వాదింప చను వెర్రిబాగులాడు
అనుభవించు కొలంది నినుమడించుచు మరం
దము జాలువారు చైతన్య ఫలము
భాష రాదు, వట్టి పాలు మాత్రమె త్రాగు,
నిద్రపోవు, లేచి నిలువలేడు .. (చిన్ని నాన్న)
ఎవ్వరెరుంగ రితని దేదేశమో గాని,
మొన్న మొన్న నిలకు మొలిచినాడు!

సుప్రసిద్ధ కథకులు శ్రీకొడవటిగంటి కుటుంబరావు గారి కుమారుడు శ్రీకొడవటిగంటి రోహిణీప్రసాద్‌గారు ఈ శిశు వు పద్యాలగురించి చెబుతూ..."చాలా ఏళ్ళ క్రితం ఒక తెలుగు వారి ఇంట్లో నేను ఈ పద్యాలు పాడాను. ఆ ఇంటి యజమాని భార్య తెలుగు వారే, కానీ పుట్టటం పెరగటం అంతా ఉత్తర భారత దేశంలోనే! యాదృచ్ఛికంగా ఆ దంపతులకి కొన్ని నెలల వయస్సు ఉన్న అబ్బాయి ఉన్నాడు. పాడేటప్పుడు నా మామూలు అలవాటు ప్రకారం నేను తల వంచుకొని ఈ నాలుగు పద్యాలు పాడి తల ఎత్తి చూసేసరికి ఆ ఇంటావిడ కళ్ళ నీళ్ళతో కనిపించింది. ఆవిడకి తెలుగు సాహిత్యంతో కానీ, భారతీయ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

సంగీతంతో కానీ ఎక్కువ పరిచయం లేదు. అయినప్పటికీ "ఈ పద్యాల సాహిత్యం, అందులో దాగిన సంగీతం వింటే నాకు అన్నీ అర్థమయి ఏడుపు ఆపుకోలేకపోయాను" అని ఆమె చెప్పగానే ఈ పద్యాల సృష్టికి కారణమైన సాహిత్య – సంగీత కర్తల విశ్వరూపం ఒక్కసారిగా నాకు కళ్ళకి కట్టినట్టయింది! " అనడం ఈ శిశువు పద్యాల విశిష్టతను మనకు తెలియజేస్తుంది.

సాహిత్యానికి తగ్గ సంగీతం, సంగీతానికి దీటైన సాహిత్యం రెండూ పోటాపోటీలుగా కలవటం అరుదైన విషయం. మహాకవి గుర్రం జాషువా రచించిన నాలుగు పద్యాలను (శిశువు) సంగీత దర్శకుడు, ఆంధ్రుల అమర గాయకుడు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు నాలుగు విభిన్న రాగాల్లో స్వరపరచి గానం చెయ్యటం తెలుగువారి అరుదైన అదృష్టమే. అప్పుడే పుట్టిన పాపాయిపై ఇంత రసాత్మకంగా కట్టిన పద్యాలు బహుశా తెలుగులో మరింక లేవేమో!

ఇక ప్రకృతిని గురించి జాషువా వర్ణించినంతగా ఏ భావకవి వర్ణించలేదన్నది నా అభిప్రాయం. ముద్దుకృష్ణ సంకలనం చేసిన 'వైతాళికులు' భావకవితా సంపుటిలో జాషువాకు చోటు దక్కలేదు కానీ, ఆయన రాసినంత భావుకతతో మరే తెలుగు కవి ప్రకృతిని గురించి, పశుపక్ష్యాదులను గురించి రాయలేదోమో అనిపిస్తుంది. దీనికి ఉదాహరణగా ఆయన ఖండకావ్యాలులోని 'గిజిగాడు'ను ఒక్కసారి చదివితే చాలు

"తేలిక గడ్డిపోచలు దెచ్చి, రచించెద వీవు తూగుటు
య్యేల గృహంబు, మానవుల కేరికి సాధ్యముగాదు, దానిలో
జాలరు, లందులో జిలుగు శయ్యలు, నంతిపురంబులొప్పగా
మేలు భళీ! పులుంగుటెకిమీడవురా! గిజిగాడ నీడజా!

ఈయన చేసిన వర్ణన సామాన్యమైనదా? ఒక చిన్న పక్షి గిజిగాడు. ఎక్కడో పాడుబడ్డ బావుల్లో చెట్లకు వేలాడుతూ ఉన్న చిన్న పక్షిగూడును గురించి వర్ణించడం మామూలు విషయం కాదు. ఆ పక్షి మనస్సును తెలుసుకున్న వ్యక్తిగా, ప్రకృతి పరిశీకుడుగా జాషువా మనకు దర్శనమిస్తాడు. ఆ పక్షి తీసుకుని వచ్చే ఒక్కోగడ్డిపోచను బాగా గమనించినట్లుంది, అందులోని నిర్మాణ శైలిని, ఎక్కడో అంత:పురాల్లో ఉన్న సౌకర్యాలను ఈ గిజిగాడు తనకు తానుగా సమకూర్చుకోవడం, "జిలుగు శయ్యలు" అంత:పురాల్లోని సౌకర్యాలతో పోటీపడటం ఒక అద్భుతమైన విషయం. దాన్ని మనకు కళ్ళకు కట్టినట్లు వర్ణించడం ఒక్క జాషువాకే చెల్లింది.

మన ఇండ్లలో అప్పుడప్పుడూ బూజు దులపండి అంటూ అనే మాటలను వింటూ ఉంటాం. ఇంట్లో మనం వాడని ప్రదేశాల్లో సాలెపురుగు సాలెగూడును కట్టుకుంటుంది. నేతన్న నేసే చీరలాగా నీవు ఎంతో అందంగా సాలెగూడును అల్లుకొని పురుగులను ఆకర్షించుకొని, అందులో అవి చిక్కుకోగానే భుజించే నీవు లోకానికి స్వార్థపరురాలిగా కనిపిస్తున్నావు ఓ సాలెపురుగా అంటూ జాషువా సాలెపురుగును గురించి వర్ణిస్తాడు.

నీవు నూలు తయారు చేసుకోవడానికి నీకు పత్తిగాని, రాట్నంగానీ లేవు. నీకు దేవుని శక్తివలన నీ కడుపులోనే పత్తిని, రాట్నాన్ని ఉంచుకున్నావా? ఎంత అద్భుతంగా పట్టులాంటి వస్త్రాన్ని అందంగా సాలెగూడుగా అల్లుతావు? అంటూ...

"ఢక్కాలమల్లు పసందు నేతపనివాండ్రా, నీయుపాధ్యాయు? లి
ప్డొక్కండున్ గనరాడు, డాగుకొనినారో? నీదురగర్భంబునం
దిక్కాలంబున నిన్ను మించు పనివాడే లేదు; దుర్వృత్తికిన్
దిక్కై, నీ యసమాన కౌశలము వ్యర్థీభూతమై పోయెడిన్" అయినా నిన్ను పురుగుల గుంపును మోసపుచ్చేందుకు వల పన్నావని లోకం నిన్ను దొంగగా ఆపాదిస్తుంది, నీలోని పనితనాన్ని యెవ్వరూ ప్రశంసించరు అని సాలీడును వర్ణిస్తాడు జాషువా.

తన పెంపుడు జంతువైన 'జాకీ'ని గురించి, గుర్తుచేసుకొంటూ 'జాకీ' అనే ఖండికను రాశాడు జాషువా. తాను పెంచుకున్న కుక్క తనపై చూపిన విశ్వాసాన్ని, తనతో ఆడుకున్న సందర్భాన్ని ఆయన చక్కగా అక్షరీకరించాడు.

"ఏకాలంబుననో! ఋణంబువడి నన్నిన్నాళ్ళు సేవించి, నే
డీకాయంబు పరిత్యజించితివి, జాకీ! నాకు మర్యాదతో

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

దోకాడింపుల స్వాగతంబు లిడి సంతోషించు నీదృష్టికిన్
నాకన్నను మొనగాడు నుత్తముడు గన్పట్టండుగా? యుర్వరన్ అంటూ జాకీతో తనకున్న అనుబంధాలను, ఆత్మీయతను గుర్తుకు చేసుకున్నాడు జాషువా. అంటే జాషువా తన చుట్టూ ఉన్న ప్రకృతిని ఎంతగా ప్రేమించాడో దీన్నిబట్టి అర్థమవుతోంది. మనుషులనే కాదు, తనచుట్టూ ఉన్న ప్రాకృతిక ప్రపంచంలో ప్రతి వస్తువుతోనూ ఆయన అనుబంధాన్ని పెంచుకున్నాడు, కవిత్వంగా అందరితో పంచుకున్నాడు.

ఇక కార్మిక, కర్షకవర్గ పక్షపాతిగా జాషువాను చూద్దాం. సమాజంలోని అసమానతలను తాను చవిగొన్నాడు. అయినా ప్రతిభద్వారా పైకి వచ్చాడు. అందుకే ఎప్పుడూ ఆయన శ్రమను గుర్తిస్తాడు. సమాజంలో కష్టపడి పనిచేసేవానికి తగిన గుర్తింపు రాలేదని, దాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెబుతాడు జాషువా. శిల్పి అనే ఖండికలో శిల్పి గొప్పతనాన్ని చక్కగా వర్ణించాడు జాషువా

"సున్నితంబైన నీ చేతి సుత్తె నుండి
బయలువడె నెన్ని యెన్ని దేవస్థలములు
సార్థకము గాని యెన్ని పాషాణములకు
గలిగె నీనాడు పసుపుగుంకముల పూజ"

నిజమే కదా పాషాణంగా, అచేతనంగా పడి ఉన్న బండరాళ్ళను, శిల్పి చేతితో ఎంతో కష్టపడి వాటిని దేవతా విగ్రహాలుగా మలిస్తే అవి జనాల చేతుల్లో, గర్భాలయాల్లో పసుపు కుంకుమల పూజలందుకొంటున్నాయి. కానీ వాటిని తన చేతులతో రూపొందించిన శిల్పికి మాత్రం ఆ దేవాలయాల్లోకి ప్రవేశం ఉండదు. దేవాలయాల్లో ప్రతిష్టించిన తర్వాత తాను స్వయంగా రూపొందించిన ఆ శిల్పాన్ని తాను తాకలేకపోతాడు. ఇంతకన్నా దౌర్భాగ్యపు పరిస్థితి ఉంటుందా? ఎంత శ్రమకోర్చి, ఎన్ని స్వేదాశ్రువుల్ని చిందించి, ఎంత శక్తిని ధారపోసి వాటిని ఒక ఆకృతిగా రూపొందించిన తనకు వాటిని తాకలేని స్థితి రావడం నిజంగా సిగ్గుచేటంటాడు జాషువాగారు.

ఇక్కడ మనం మరో అంశాన్ని కూడా గమనించాల్సి ఉంది. జాషువా కూడా అనేక కావ్యాలు రాశాడు. అయినా తాను అంటరానివానిగా ఎదుర్కొన్న బాధ చాలా ఇబ్బంది పెట్టింది. తాను రచించిన కావ్యాలలో ఉత్తమమైన వాటిని ఈ సమాజానికి చెప్పేవారు కరువయ్యారు కదా అని ఒకానొక సందర్భంలో బాధను వెలిబుచ్చారు. అయోమయం అనే ఖండిక ఇందుకు సాక్షీభూతంగా నిలుస్తుంది.

"నా కవిత్వంబునందు రత్నములు గలవు,
వాని వెకలించి చూపెడు వాడు లేడు
కాలమిట్లున్నదని" మొనగాడు వోలె
బలుకు కవిగాడ! యేటికి స్వాతిశయము"

ఇలాంటి సంఘటనను కూడా అక్షరీకరించడం ఒక్క జాషువాకే చెల్లింది. పద్యసాహిత్య ప్రక్రియను ఇంత ఉదాత్తంగా చిత్రించిన మరో కవి మనకు ఆధునిక తెలుగు సాహిత్యంలో వెయ్యిదివిటీలు పెట్టి వెదికినా కనిపించదు.

గబ్బిలం కావ్యం గురించి అందరికీ తెలిసిందే. ఆంధ్రదేశంలో చాలామందికి గుర్రం జాషువా పేరు వినగానే గుర్తొచ్చే కావ్యం 'గబ్బిలం'. అందులో అరుంధతీ సుతుడు కాపురముండిన "దక్షిణభాగ" భూముల నుంచి అంటే తంజావూరు ప్రాంతం నుంచి ఇంచుమించుగా భారతదేశం క్రింది భాగం నుండి హిమాలయ పర్వతంలోని కైలాసం వరకు 'గబ్బిలం' యాత్ర జరుగుతుంది. మధ్యలో గబ్బిలం సేదదీరుతూ... అనేక ప్రాంతాలను దర్శించిపోవాలంటూ దారి చెప్తాడు జాషువా. ఆ చెప్పిన దారి మొదలు తంజావురు రఘునాథ నాయకుని ఆస్థానం మొదలు కర్నాటక, ఆంధ్రదేశం, ఒడిస్సా మీదుగా ఢిల్లీకి సాగుతుంది. అక్కడ నుండి కైలాసానికి యాత్ర చేరుతుంది. ఇక్కడ జాషువాగారి ఆంధ్రాభిమానం మనకు బాగా ప్రస్ఫుటం అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలను గబ్బిలం కావ్యంలో వర్ణిస్తాడు జాషువా.

దేశ రాజధాని నగర వర్ణన జాషువా గబ్బిలం కావ్యానికే మకుటాయమానం. ఆయన దేశాభిమానానికి నిదర్శనం. రాజధాని చరిత్రను ఒక్క పద్యంలో నిక్షిప్తం చేసే ప్రయత్నం చేశారు ఆయన.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

"ముడిచె నిచ్చట కుంతి కొడుకు ద్రోవది కొప్పు
పగవాని రుధిరంబు పరిమళింప
మెఱసె నిచ్చోట నాదరుషా కుఠారంబు
నిఖిల భారతము కన్నీరు నింప
వెలసె నిచ్చోట పచ్చల బర్హి పీఠంబు
షాజానురాజునాస్థాన వాటి
పెండ్లాడె నిచ్చోట పృథ్వీరాజొక రోజు
జయచంద్రు సుతను దోస్సార గరిమ
యుగయుగాల కథలనుదరాన జీర్ణించి
రాజ రక్త నిర్ఝరముల దేలి
నవ్వుచున్న ఢిల్లీ నగరంబు నందంబు
తరుగులేదు శిరము నెరయ లేదు

మహాభారత యుద్ధ కాలం నుంచి రాజపుత్రుల కాలం వరకు జరిగిన పరిణామాలను హస్తినాపురం కేంద్రీకృతంగా వర్ణించే ప్రయత్నం చేశాడు ఇందులో. మహాభారత యుద్ధ సమయంలో భీముడు దుశ్శాసనుని రొమ్మును చీల్చి, ఆ రక్తంతో ద్రౌపది ప్రతిజ్ఞను నెరవేర్చిన ఉదంతం సాహిత్యంతో పరిచయం ఉన్న వారందరికీ తెలిసిన ఘట్టమే. విదేశీయులు భారత్‌దేశంపై చేసిన దాడులను, భారతావని విలపించిన తీరున వర్ణించాడు. మొగల్ పరిపాలనా కాలంలో షాజహాన్ పరిపాలనను కళ్ళముందుంచే ప్రయత్నం చేశాడు. ఆయన నిర్మించిన బంగారు నెమలి సింహాసనం గురించి పాఠకులకు తెలియపరిచాడు. పృథ్వీరాజ్-రాణీ సంయుక్తల ప్రేమగురించి, వివరించాడు. నాలుగు సీసపద్య పాదాల్లో కొన్ని వేల సంవత్సరాల చరిత్రను నిక్షిప్తం చేయాలనుకోవడం చాలా గొప్ప పరిణామం. యుగయుగాల కథలను తన కడపులో పెట్టుకొని, అనేక సంఘటనలకు సాక్షీభూతంగా నిలిచి తట్టుకొన్న ఢిల్లీ నగరం యొక్క అందం నిత్య దేదీప్యమానం అని చెప్పడం... "నవ్వుచున్న ఢిల్లీ నగరంబు నందంబు" అంటూ దేశరాజధానిపై ఆయనకున్న మమకారం, ఆపేక్షలను గబ్బిలం కావ్యంలో చూడవచ్చు. ఆయనకు అంత మక్కువ లేకపోతే ఇంత అద్భుతమైన పద్యాన్ని రాస్తారు? ఆయన వర్ణనల విశిష్టతకు ఈ పద్యం ఒక పరాకాష్ఠగా నిలుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఇక భార్యా భర్తల అన్యోన్యతను గురించి, ఆప్యాయతలను గురించి ముంటాజ్‌మహలు కావ్యంలో అద్భుతంగా వర్ణించారు జాషువా మహాకవి.

"ఆవిరియోడలో జలధియాన మొనర్చెడు బాటసారులో
భూవర రేవులందు దిగివోయెద రించుక వెన్క ముందుగా
నీ వసుధాపణంబు పనియెల్ల ముగించి స్వదేశగాములై
పోవుచు వచ్చుచుంద్రు సతమున్ బ్రజలీ నరజన్మ వర్తకుల్"

"రాణి విడచిపోయె రాజు నొంటరి జేసి
రాజువిడిచిపోయె రాజ్య రమను
రాజ్యరమయు విడిచె రాజుల బెక్కంద్ర
తాజి విడువలేదు రాజసంబు"

షాజహాన్ హృదయరాణి ముంతాజ్‌బేగం జ్ఞాపకార్థం యమునానది తీరాన తాజ్‌మహల్ నిర్మించిన సంగతి తెలిసిందే. వారివురి అన్యోన్యత, ప్రేమానురాగాలకు ఇది తీపి గుర్తు. ముంతాజ్‌బేగం, షాజహాన్‌ల ప్రణయానికి ప్రత్యక్ష నిదర్శనం తాజ్‌మహల్. తాజ్‌మహల్ నానాటికీ తన అందాన్ని, రాజసాన్ని నిలుపుకొంటూ ప్రత్యేకతను చాటుకుంటూనే ఉందని, రాణి,

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

రాజు మరణించినా, వారు ఏలిన సామ్రాజ్యాలు కనుమరుగైనా, వారి ప్రేమకు చిహ్నమైన తాజ్‌మహల్ ఎంతోమంది యువతీయువకుల ప్రేమకు సాక్షీభూతంగా నేటికీ తన రాజసాన్ని నిలబెట్టుకొంటున్నదని జాషువాగారి ఉవాచ.

1940 తర్వాత బలంగా వీచిన అభ్యుదయ కవిత్వంలో కూడా జాషువా తనదైన ముద్ర వేశారు. 1930వ దశకంలోనే శ్రీరంగం నారాయణబాబు, శిష్టా, శ్రీశ్రీవంటి యువకవులు అభ్యుదయ కవిత్వాన్ని తెలుగులో ప్రారంభించారు. మా కవులు సహృదయ భావంతో అన్నార్తుల ఆకలిని దయనీయంగా చిత్రించారు. కమ్యూనిస్టుపార్టీ చిహ్నాలైన అరుణపతాకంలోని సుత్తీ కొడవలి వంటి వాటిని కూడా ప్రస్తావించారు.

“కొడవటిటెక్కెమున్ దలను గూరిచి కార్మిక కర్షకాళితో

నడుము బిగించె నీ యుగమునందొక నూతన సామ్యవాద” (కాందిశీకుడు పుట.44) –మని 1943 లోనే అభ్యుదయ కవిత్వాన్ని విశ్లేషించాడు. రెండో ప్రపంచ యుద్ధ ఫలితాలమీద రాసిన రచన “కాందిశీకుడు”. ఈ రచన ముప్ఫయవ దశకంలో రాసిన “అనాథ”కు కొనసాగింపుగా భావించవచ్చు. ఇందులో వస్తువు పేదరికం. ఆర్థిక మాంద్యాన్ని ప్రపంచ యుద్ధ ఫలితాన్ని సమన్వయం చేసే వస్తువు కాందిశీకుడు.

“శ్రీనాథ సుకవి భక్షించిన పలనాటి
యలనాటి జొన్నకూ డారగించి
కారెమపూడి గొడ్డు గారంబు ధాటికి
తాళజాలక గింగిరాలు దిరిగి,
నాప బండల క్రింద గాపురం బొనరించు
మంద్రగబ్బుల పరామర్శ లంది
గురిగింజలంతేసి గురిజాల దోమల
గానంబునకు మేను కంపమెత్తె” అనడాన్ని బట్టి చూస్తే ఒకప్పుడు ఎంతో ప్రాధాన్యత పొందిన పల్నాడు ప్రాంతం ఇప్పుడు ఈ ఆకలి కేకలతో అల్లాడిపోతోందని, మహాకవి శ్రీనాథుడు చివరి దశలో తన సర్వస్వాన్ని కోల్పోయి జొన్నకూడు తిన్న పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోందని, ఒకప్పుడు ఎంతోమందికి సహపంక్తి భోజనాలతో కళకళలాడిని కారంపూడి నేటి కరువుకు గొడ్డుకారం తినాల్సి వస్తోందని చెబుతూ... ప్రపంచ యుద్ధ ఫలితం, అది దేశంలోని వివిధ ప్రాంతాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కాందిశీకుడులో చక్కగా వివరించాడు జాషువా.

దేశంలోనే అతిపెద్ద మానవ నిర్మిత ప్రాజెక్టుగా గణతికెక్కిన నాగార్జున సాగర్ నిర్మాణం, విశిష్టతలను గురించి కూడా జాషువా పద్యకవిత్వాన్ని వెలువరించారు.

“నాగార్జునాచార్య నయనద్వయము నుండి
జన్మించె సౌభాగ్య సాగరంబు
బ్రహ్మనాయని చిత్త పద్మంబు వికసింప
నుదయించె హరిజనాభ్యుదయ సంధ్య
వర్ష పంచకరత్న పథక కల్పక మందు
చిగురించె నగర సంక్షేమ శాఖ
ఆంధ్ర ప్రదేశంబు నాశ్లేష మొనరింప
నేతెంచె రసవాణి కృష్ణవేణి
అక్షరాక్షర మధురస స్యందు లగచు
కూయుచున్నవి సుకవితా కోకిలములు
తెలుగు గద్దె ప్రజాభీష్టములు ఘటించి

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(3), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

Cover Page

అంటూ నాగార్జున సాగర్ నిర్మాణ విశేషాలను వివరిస్తాడు. నాగార్జునసాగర్ ప్రముఖ బౌద్ధ చారిత్రక స్థలం కూడా. శాతవాహనుల కాలమునాటి శ్రీ పర్వతమే నాగార్జున కొండ. ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో బోధనలు చేసినట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. జలాశయం నిర్మాణ సమయంలో ఇక్కడ లభించిన అమూల్యమయిన చారిత్రిక కట్టడాల శిథిలాలను జలాశయం మధ్యలో నాగార్జునకొండ అని ఇప్పుడు పిలువబడే ప్రదర్శనశాలలో భద్ర పరచారు.

ఇక చివరగా జాషువా స్మశానవాటి గురంచి వివరించి ముగిస్తాను. స్మశానం మనిషి అంతిమ స్థలం. ఇక్కడ ఎవరి మతాచారాల ప్రకారం వారిని ఖననం, దహనం చేస్తారు. జాషువా రాసిన పద్యాల్లో ఇవి చాలా ప్రత్యేకతను నిలుపుకొన్నాయి.

“ఎన్నోయేండ్లు గతించిపోయినవి గానీ, యీశ్మశానస్థలిన్
గన్నుల్ మోడ్చిన మంద భాగ్యుడొకడైనన్  లేచిరా దక్కటా!
యెన్నాళ్ళీ చలనంబు లేని శయనం బే తల్లు లల్లాడిరో!
కన్నీటం బడి క్రాగిపోయినవి, నిక్కంబిందు పాషాణముల్”

స్మశాన స్థలం గురించి ఇంతకన్నా ఇంకేమని వర్ణించాలి. ఎంతోమంది తల్లుల కడుపుకోత గురయ్యారని, కానీ ఎన్ని కన్నీటి బొట్లు కార్చినా కరగని పాషాణాలు స్మశానాలు. ఎంత చక్కని వర్ణన. ఇక ఎప్పటికీ తిరిగిరాని వారు చలనం లేకుండా పడుకోవడమే కదా శాశ్వతత్వం. ఎన్నేళ్ళయినా, ఎన్నాళ్ళయినా ఇక్కడి నుంచి కళ్ళు తెరచి బయటికి వచ్చినవాడు ఒక్కడు కూడా లేడు! ఔరా! ఎంత చక్కటి విశ్లేషణ. నిజంగా జాషువా కలం ‘వాడి’ ఇక్కడ మనకు కనిపిస్తుంది. జీవిత సత్యాన్ని కాచి వడకాచిన విధంగా ఎంత అద్భుతంగా జీవితం చరమాకం గురించి వర్ణించాడు. అంతేకాదు,

“ఇచ్చోట నేసత్కవీంద్రుని కమ్మని కలము
నిప్పులలోన గఱగి పోయె
యిచ్చోట నేభూము లేలురాజన్యుని,
యధికార ముద్రిక లంతరించె
యిచ్చోట నేలేతయిల్లాలి నల్లపూసల
సౌరు గంగలో గలసి పోయె
యిచ్చోట నెట్టి పేరెన్నికం గనుగొన్న
చిత్రలేఖకుని కుంచియ నశించె
ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె గదిలించి యాడు రంగస్థలంబు
యిది మరణ దూత తీక్షణ దృష్టులొలయ
నవని బాలించు భస్మసింమాసనంబు

నేను ఫలానా. నేను ఇది. నేను అది. అని చెప్పుకుని విర్రవీగే మనిషి అహంకారం ఎక్కడ ఉందో వెతుక్కోమంటాడు జాషువా. అందుకే మనిషి మానవత్వంతో బ్రతకాలని ఆయన సూచించాడు. ఏరంగంలో నిష్ణాతుడైనా, నియంత అయినా ఎప్పుడో ఒకసారి నేల రాలాల్సిందే, భూమితల్లి ఒడిలో సేదదీరాల్సిందే. దీనికి వేరే ప్రత్యామ్నాయం లేదు. కానీ ఒక్కటి ఉంది. ఏంటి అంటే? శాశ్వతత్వం. ఎలాంటి శాశ్వతత్వం ఉంటుందంటే సమాజానికి హితం కలిగించి, పదిమంది బ్రతుకులు బాగుపరుస్తావే అలాంటి శాశ్వతత్వం. సాహిత్యం కూడా సమాజానికి హితాన్ని కలిగించేది, జాతిని జాగృతం చేసేది. అలాంటి సాహిత్యం ద్వారా సమసమాజ స్థాపన చేయాలనుకున్న గుర్రం జాషువా ఆ సాహిత్యం ద్వారా నిత్య శాశ్వతత్వం పొందాడు.

“రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె”

## ఆధార గ్రంథాలు

1. జాషువా (సర్వలభ్య సంకలనం) – సంపాదకులు యం.వి. రాయుడు, టి. శ్యామనారాయణ,

మనసు ఫౌండేషన్, కనకపుర రోడ్, బెంగళూరు.

2. జాషువా రచనలు నాలుగవ సంపుటం (ఖండకావ్యాలు) – గుర్రం జాషువా
3. తెలుగు సాహిత్య చరిత్ర – డా.ద్వా.నా.శాస్త్రి
4. గుర్రం జాషువా పాపాయి పద్యాలు – విష్ణుభొట్ల లక్ష్మన్న, సెప్టెంబర్ 2009 (వ్యాసం)
5. నవయుగ కవి చక్రవర్తి, కవికోకిల – శ్రీ గుర్రం జాషువా – టీవీయస్.శాస్త్రి (వ్యాసం)